కొర్రీలు పెడుతున్న ఏపీఐఐసీ

- నలుగుతున్న ఎస్ఎంఎస్ఈ నిర్వాహకులు!
- నిబంధనల పేరిట అధికారుల నుంచి తప్పని తలనొప్పులు
- ఇప్పటికే పెరిగిన పన్నులతో పరిశ్రమలను నిర్వహించలేని వైనం
- 90శాతం మందికి ఇప్పటివరకూ చేయని సేల్ డీడ్స్
- ఈ రూల్స్ మామూళ్లకోసమేనంటున్న బాధితులు
- ఇదీ పలమనేరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నివేదన'

ఏపీఐఐసీ అధికారుల సేల్ డీడ్ల రిజిస్ట్రేషన్‌లకు నిబంధనల పేరిట పెడుతున్న కొర్రీలతో పలమనేరు ప్రాంతంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఎస్ఈజెడ్‌లలోని ఎస్ఎంఎస్ఈ, ఎంఎస్ఎంఈ, ఎంఎస్ఎంఈ నిర్వాహకులకు తలనొప్పులు తప్పడం లేదు. అన్నీ కరెక్ట్‌గా ఉన్నా ఏదో ఒకదానిని సాకుగా చూపి సేల్ డీడ్స్ కాకుండా అడ్డుపడుతున్నట్టు బాధితులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే మూడింతలు పెరిగిన ప్రాపర్టీ టాక్స్, కరెంట్ చార్జీలు, కార్మికులకు జీతాలతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో అధికారుల వేధింపులు ఎక్కువైనట్టు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సైతం తీసుకెళ్లేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

పలమనేరు: జిల్లాలోని పడమటి ప్రాంతమైన పలమనేరులో ఎక్కువగా వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ పెద్ద పరిశ్రమలు అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏపీఐఐసీ(ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) ద్వారా ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించింది. ఈ నేపథ్యంలో పలమనేరు మున్సిపాలిటీ, గంగవరం పరిధిలోని 25 ఎకరాల్లో 130కు పైగా ఎంఎస్ఎంఈలు ఏర్పడ్డాయి. ఇందులో 126 మైక్రో, మూడు స్మాల్, ఒక మీడియం ఎంటర్‌ప్రైజెస్‌లుగా ఉన్నాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రకరకాల పరిశ్రమలను ఇక్కడ ప్రారంభించి పలువురికి ఉపాధిని కల్పిస్తున్నారు. ఆటో నగర్‌లో 294మందికి, ఎంఎస్ఎంఈ ద్వారా 130మందికి స్థలాలను కేటాయించారు. ఇందులో 80 శాతం మంది ఇక్కడ నిర్మాణాలను చేపట్టగా కొందరు నిర్మాణాలను చేపడుతున్నారు. ఇక్కడ ఇంజినీరింగ్, కెమికల్స్, ఉడ్, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్, పేపర్, ఫల్ప్, సిమెంట్ బ్రిక్స్, సిల్క్ రీలింగ్, ఆహారోత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలున్నాయి.



పలమనేరు సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఆటోనగర్



పలమనేరు సమీపంలో ఏపీఐఐసీ దరఖాస్తుదారులకు కేటాయించిన స్థలాలకు సంబంధించి మ్యాప్

ఈవోటీలకు తప్పని తిప్పలు

సాధారణంగా డీపీఆర్‌లో ఇచ్చిన ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలి. అయితే నిర్మాణాలు లేదా యంత్రాలు మొదలైన వాటి ఏర్పాటులో ఆలస్యమైతే మూడు, ఆరునెలలు, ఏడాదికి చదరపు మీటర్ల మేర నిర్ణయించిన మేర ఫీజు ఏపీఐఐసీకి చెల్లించాలి. దీనికి సైతం చేయి తడపాల్సిందేనని ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ స్థలాలు తీసుకున్న వారిలో 30శాతం మంది ఇంకా భవనాలు నిర్మించలేదు. మరికొందరు డీపీఆర్‌లోని ప్రాజెక్టులను మొదలు పెట్టలేదు. వీరికి గడువు అవసరముంటుంది. ఇందులో ఎక్కువ శాతం మంది ఎస్సీ, ఎస్టీలకు స్థలాలను కేటాయించారు. వారి ఆర్థిక స్థోమత కారణంగా గతంలో పరిశ్రమల నిర్మాణానికి ఇచ్చిన గడువును మరో మూడేళ్లు పొడిగించింది. వీరిలో గడువు మీరిన వారు ఈవోటీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

సేల్‌డీడ్స్‌దే అసలైన సమస్య

డీపీఆర్ ద్వారా స్థలాలు మంజూరై అగ్రిమెంట్ పొందిన వారు పూర్తిస్థాయిలో పరిశ్రమను నిర్వహించి తయారైన ఉత్పత్తులను చూపెట్టి ఆపై నిర్ణయించిన పత్రాలను కలిగిఉంటే వారికి ఏపీఐఐసీ సేల్‌డీడ్స్ రిజిస్ట్రేషన్ చేయిస్తుంది. అయితే ఇక్కడున్న వారిలో 90 శాతం మందికి సేల్‌డీడ్స్‌పై కొర్రీల బాధ తప్పడం లేదు. దీనికోసం డీసీపీ(డేట్‌ఆఫ్ కమర్షియల్ ప్రొడెక్షన్ సర్టిఫికెట్), పవర్ రిలీజ్ సర్టిఫికెట్, కరెంట్ బిల్లులు, ప్రొడక్స్ తొలి, తాజా సేల్స్ బిల్లులు, భవనంలోని యంత్రాల ఫిక్స్, ప్రాపర్టీ టాక్స్ నో డ్యూస్, సీఏ, ఎంప్లాయ్‌మెంట్ సర్టిఫికెట్లు, బిల్డింగ్ అప్రూవల్, ఏరియా, ఆక్యుపెన్సీ, జీఎస్టీ, 9మందికి లోపైతే లేబర్ సర్టిఫికెట్, 9మందికి పైచిలుకు ఉంటే ఈపీఎఫ్ సర్టిఫికెట్లు పొంది ఉండాలి. అయితే వీటిలో ఏదో ఒకదానిలో అధికారులు కొర్రీపెట్టి రిజిస్ట్రేషన్ కాకుండా చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. తాజాగా పట్టణానికి చెందిన ఓ పారిశ్రామికవేత్తకు రిజిస్ట్రేషన్‌కు అధికారులు అడ్డు చెప్పడంతో చివరకు ఆయన చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ద్వారా చెప్పించాకే రిజిస్టర్ చేసినట్టు తెలిసింది. పలుకుబడి ఉన్న వారికే ఇలా ఉంటే ఇక్కడ చిన్నపాటి పరిశ్రమలు పెట్టుకున్న వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అయితే ఏపీఐఐసీ అధికారులేమో నిబంధనలున్న పాటించే వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పడం కొసమెరుపు.

క్లుప్తంగా

పరుష ప్రారంభం



పుంగనూరులో పరుషకు తీసుకొచ్చిన పశువులు

పుంగనూరు: పట్టణంలోని శ్రీమాణిక్యవరదరాజస్వామి ఆలయ ఎద్దుల పరుష బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు అధిక సంఖ్యలో పరుషకు పశువులను తీసుకువచ్చారు. వర్షాలు పడుతుండడంతో భూములు దుక్కి చేసేందుకు పశువులను రైతులు కొనుగోలు చేయడం పరిపాటి. పశువులు అధిక ధరలు పలకడంతో రైతులు నిరాశకు గురయ్యారు. అయితే ఎక్కువ భాగం కబేళదారులు కొనుగోలు చేశారు.

రూ.35 లక్షలతో ఈద్గాలో ఫ్లోరింగ్



ఈద్గాలో ఫ్లోరింగ్ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఇబ్రహీంఖాన్

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు రూ.35 లక్షలతో ఫ్లోరింగ్ పనులను సర్పంచ్ ఇబ్రహీంఖాన్ బుధవారం ప్రారంభించారు. ఇక్కడ రంజాన్, బక్రీద్ పండుగల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ప్రాంతంలో ముళ్లకంపల వలన ఇబ్బంది పడేవారని, ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో ఉపాధి పథకం కింద నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులలో ఫ్లోరింగ్ పనులకు పూనుకున్నట్టు సర్పంచ్ చెప్పారు. కార్యక్రమంలో బొమ్మయ్యగారిపల్లె సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఫయాజ్ , ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మునస్వామిశెట్టి విగ్రహావిష్కరణ



గూడూరుపల్లె వద్ద ఆవిష్కరించిన మునస్వామిశెట్టి విగ్రహం

పుంగనూరు: పట్టణంలోని వివిధ విద్యాసంస్థలు, ఆలయాల అభివృద్ధికి పాటుపడిన సమాజసేవకుడు దివంగత ఎస్వీ మునస్వామిశెట్టి కాంస్య విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం తమ ఆర్యవైశ్యులతో కలిసి గూడూరుపల్లె వద్ద ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మునస్వామిశెట్టి సేవలను ప్రస్తుతించారు.

సక్రమంగా విధులు నిర్వర్తించకపోతే చర్యలు

- సచివాలయ ఉద్యోగులకు కమిషనర్ హెచ్చరిక

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాలలో ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన 10వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. హాజరు పట్టిక, ప్రజావినతుల నమోదు, సర్టిఫికెట్ల పంపిణీ తదితర రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా రావడం లేదని, ప్రజలతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు తమకు వస్తున్నాయంటూ పైవిధంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు వినతులను నమోదు చేయడంతో పాటు సర్టిఫికెట్ల పంపిణీ చేయాల్సిందేనని ఆదేశించారు. మళ్లీ ఫిర్యాదులు పునరావృతమైతే క్రమశిక్షణా చర్యల విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈఈ మహేష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

• నిమజ్జనం



నిమజ్జనానికి తరలుతున్న గంగమ్మ

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులపాటు గంగజాతర ఉత్సాహంగా నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు టి.పుత్తూరు, దిగువ తడకర గ్రామాల్లో బుధవారం గంగమ్మకు భక్తులు విశేష పూజలు చేశారు. అనంతరం గంగమ్మను మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. భక్తులు అమ్మ వారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించారు.

నోటీస్ బోర్డు

• ఆయా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రొంపిచెర్ల: మోటుమల్లెల అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టు (ఓసీ)కు అర్హులైన మహిళలు ఈ నెల 16 నుంచి 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష కోరారు. కనీస విద్యార్హత పదవ తరగతి అని, 18–35 ఏళ్లలోపు స్థానికులు అర్హులని తెలిపారు. దరఖాస్తులను పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

సదుంలో..

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టు (ఎస్సీ)కు అర్హులైన వారు ఈనెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని పులిచెర్ల సీడీపీఓ మల్లీశ్వరి బుధవారం తెలిపారు. దరఖాస్తులు తమ కార్యాలయంలో పొందవచ్చని, అలాగే ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

• నేడు జాతరకు మాజీ ఎమ్మెల్యే రాక

పలమనేరు: పట్టణంలో గురువారం అమ్మవారి జాతర సంబరాల్లో పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అమ్మవారిని దర్శించుకుంటారని పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి పార్టీశ్రేణులతో ప్రదర్శనగా ఆలయానికి వెళ్తారని తెలియజేశారు.

'అన్నదాత సుఖీభవ'కు పరిశీలన చేసుకోవాలి

గుడుపల్లె: అన్నదాత సుఖీభవ పథకానికి రైతు సేవా కేంద్రంలో రైతులు పరిశీలన చేసుకోవాలని వ్యవసాశాఖ అధికారి నాగరాజు తెలిపారు. ప్రభుత్వం త్వరలో ఈ పథకం కింద రైతులకు నగదు జమ చేస్తుందని పేర్కొన్నారు. దీనికోసం భూములున్న రైతులు ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలకు ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పుస్తకం , సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లి నమోదు చేయించుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సుడిగాలి పర్యటన



నడింపల్లెలో మంగళ హారతులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు



రొంపిచెర్ల: మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

రొంపిచెర్ల: పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం మండలంలో బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. నడింపల్లెలో చౌడేశ్వరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ మహిళలు ఎమ్మెల్యేకు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. అలాగే, చెన్నారెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సహదేవరెడ్డి ఇంట నూతన వధూవరులు నిఖిలేశ్వర్ రెడ్డి, శ్రావణిలను ఆశీర్వదించారు. అనంతరం సవ్వాలవాండ్లపల్లెలో అనారోగ్యంతో మృతి చెందిన విశ్వనాథ నాయుడు కర్మక్రియలకు హాజరై మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డిశ్వర్ రెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చౌడేపల్లె మండలంలో..

చౌడేపల్లె: మండలంలో బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించారు. కాగతి యల్లంపల్లెలో సదానందరెడ్డి, బయ్యపల్లెలో రామచంద్రారెడ్డిల నివాసాల్లో నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పరికిదొన సర్పంచ్ లక్ష్మీదేవి బాబు గృహ ప్రవేశానికి హాజరయ్యారు. ఆయా గ్రామాల ప్రజలు పెద్దిరెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్, నాయకులు పాల్గొన్నారు.

కూలీలకు 'ఉపాధి' కల్పించండి

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పుంగనూరు: వేసవిలో కూలీలకు విరివిగా ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డితో కలసి వివిధ అభివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు. వేసవిలో మంచి నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, అలాగే పశువులకు నీరు, గ్రాసం సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ఉపాధి పనులు కల్పించేందుకు దృష్టి సారించాలని, పనులు చేసే ప్రదేశాల్లో తాగునీరు, నీడ వసతి కల్పించాలని, ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలన్నారు.మంచినీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. జలజీవన్ మిషన్ కింద నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులకు మంచినీటి కనెక్షన్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగభూషణం, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

- జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

పుంగనూరు: రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ కోరారు. బుధవారం ఏడీ శివకుమార్‌తో కలసి డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులతో సమీక్షించారు. డివిజన్‌లో 92,697 మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకు 51,270 మంది రైతులు మాత్రమే పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలంటే విధిగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఆయా ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులు నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. అలాగే డివిజన్ పరిధిలో 6490 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉండగా కేవలం 3,148 మాత్రమే సేకరించారన్నారు. రైతులకు పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలను సబ్సిడీపై ఇస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు పంటల సాగు విషయంలో అవసరమైన సలహాలు–సూచనలు రైతు సేవా కేంద్రాల నుంచి స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు రాజేష్, జ్యోతమ్మ, సుధాకర్, మాధవి, సుధారాణి, రభిభా, హేమలత, దీప, వ్యవసాయ విస్తరణాధికారులు శివశంకర్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.21 లక్షలు



గంగమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కుప్పం: శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయానికి హుండీ ఆదాయం 21,31,050 రూపాయలు వచ్చిందని దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. ఏడు నెలల అనంతరం బుధవారం ఆలయంలో హుండీ ఆదాయం లెక్కించారు. నగదుతోపాటు మొత్తంగా 71 గ్రాముల బంగారు,169 గ్రాముల ఆభరణాలు హుండీలో భక్తులు కానుకల రూపేణా సమర్పించారని తెలియజేశారు.

• పుష్పయాగం



కోనేటిరాయస్వామికి నిర్వహిస్తున్న పుష్పయాగం



వీక్షిస్తున్న భక్తులు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు బుధవారం శ్రీవారి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సమయంలో అర్చక, పరిచారకులు, అధికార, అనధికారులు, భక్తుల కారణంగా తెలిసో తెలియకో చేసిన దోషాలు ఏవైనా ఉన్న పక్షంలో వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం చేసినట్టు అర్చకులు తెలిపారు. అశేష సంఖ్యలో భక్తులు పుష్పయాగాన్ని వీక్షించి పులకించారు. కంకణబట్టార్ నరసింహాచార్యులు, టీటీడీ డిప్యూడీ స్పెషల్‌గ్రేడ్ ఈఓ వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర తదితరులు పర్యవేక్షించారు.

భక్తిప్రపత్తులతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ఆలయంలో ప్రతిష్ఠిస్తున్న ధ్వజస్తంభం

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

16న పుష్పపల్లకి సేవ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని దుర్గాంబ దేవస్థానంలో 16న శుక్రవారం పుష్పపల్లకి సేవను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ మునిశేఖర్ తెలిపారు. గంగజాతర తరువాత వచ్చే శుక్రవారం గ్రామదేవత దుర్గాంబకు పల్లకి సేవ చేయడం ఆనవాయితీ అని, ఈ క్రమంలో 16న ఉదయం మహా చండీహోమం, 1008 బిందెల గంగాజలంతో మహాభిషేకం, సాయంత్రం పసుపు అలంకారం ఉంటుందన్నారు.

గంగమ్మ జాతర ఏర్పాట్లపై ఎస్పీ పరిశీలన



దేవాలయ ప్రాంగణంలో పరిశీలిస్తున్న ఎస్పీ

కుప్పం: శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర పురస్కరించుకుని బందోబస్తు ఏర్పాట్లపై బుధవారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. తొలుత ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జాతర కార్యక్రమాలు, శని, ఆదివారాల్లో బస్టాండు ప్రాంగణంలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించారు. సోమవారం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశానికి పెద్ద ఎత్తున భక్తులు రానున్న దృష్ట్యా ఈ కార్యక్రమానికి, ప్రధానంగా మంగళవారం అమ్మవారి శిరస్సు పట్టణ వీధుల్లో ఊరేగింపు, బుధవారం విశ్వరూప దర్శనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గంగమ్మకు సారె సమర్పణ



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ



అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకొస్తున్న పాతపేట వాసులు

పలమనేరు: తిరుపతి గంగమ్మకు బుధవారం పాతపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం నుంచి అమ్మవారికి సారెను నిర్వాహకులు ఊరేగింపుగా తీసుకువచ్చి కొత్తపేటలోని అమ్మవారికి సమర్పించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ ఆచారం ఉందని, పాతపేటకు అమ్మవారు పుట్టినిల్లుగా, కొత్తపేట మెట్టినిల్లుగా ఉందని చెప్పారు. మరోవైపు స్థానిక ఆలయం వద్ద వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం సాయంత్రం ఆలయం వద్ద అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ఠంగా బందోబస్తు నిర్వహించడంతో సీసీ కెమెరాలు, డ్రోన్‌లతోనే పర్యవేక్షించాలని డీఎస్పీ డేగల ప్రభాకర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ, సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.